క్లుప్తంగా

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన సివిల్ జడ్జి



గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండల లీగల్ సెల్ కన్వీనర్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా శనివారం స్థానిక గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులున్నాయా లేదా తదితర అంశాలను పరిశీలించారు. భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలలో ఆహార పదార్థాల నాణ్యతను రుచి చూశారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



ముమ్మిడివరంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ముమ్మిడివరం: సాకా చిన్నిబాబు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో మొబైల్ మజ్జిగ చలివేంద్రం ద్వారా జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నాయకుడు సాకా ప్రసన్న కుమార్ బాటసారులకు మజ్జిగ ప్యాకెట్లు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోలా బాబ్జి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, బొంతు సత్యశ్రీనివాస్, అడ్డగళ్ల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం



వలంటీర్లను సత్కరిస్తున్న గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి తదితరులు

ముమ్మిడివరం: మండలంలో కర్రివానిరేవు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాశి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వలంటీర్లకు పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కాశి జగపతిరావు, మట్ట గంగాభవాని, చేట్ల దుర్గా భవాని, దాసరి దేవి, అర్థాని వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకర్ ప్రారంభం



మంచి నీటి ట్యాంకరును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు

ఐ.పోలవరం: నీటి ఎద్దడి ఉన్న శివారు ప్రాంతాల్లో తాగునీటిని అందించేందుకు ఐ.పోలవరం గ్రామానికి చెందిన అల్లూరాజు శ్రీసురాజు ఏర్పాటుచేసిన తాగునీటి ట్యాంకర్‌ను జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనురాజును పలువురు అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఝాన్సీ లక్ష్మీకుమారి, విత్తనాల శ్రీనివాసరావు, బొంతు వంశీ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికను మోసగించిన యువకుడు అరెస్ట్



నిందితుడు రామకృష్ణను అరెస్ట్ చేసిన కోరంగి పోలీసులు

తాళ్లరేవు: మైనర్ బాలికను మోసగించిన చింతా రామకృష్ణ అనే యువకుడిని శనివారం అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలిక తాళ్లరేవు మండలం చినబొడ్డు వెంకటాయపాలెంలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చింది. అయితే నడవపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానంటూ మాయమాటలు చెప్పి తనతో పాటు తీసుకెళ్లిపోయాడు. దీంతో మైనర్ బాలిక తల్లి కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో బాలిక ఆచూకీ కనుగొని నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వయం ఉపాధికి బాటలు

- చిరు వ్యాపారులకు ప్రభుత్వం ఆసరా
- మూడేళ్లలో 900 మందికి లబ్ధి



జగనన్న తోడు పథకం ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న కిరాణా వ్యాపారం

అల్లవరం: సాంప్రదాయబద్ధమైన చేతి వృత్తులను జీవనాధారంగా జీవించే అల్పాదాయ వర్గాల వారికి స్వయం ఉపాధి కల్పించే దిశగా ప్రవేశపెట్టిన జగనన్న తోడు పథకంతో చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. చిరు వ్యాపారులు, చేతివృత్తుల వారికి వ్యాపారాభివృద్ధికి బ్యాంక్‌ల ద్వారా లబ్ధిదారులకు అందించే రుణం వారి పాలిట వరంగా మారింది. జగనన్న తోడు పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రూ.10 వేలు రుణాన్ని సున్నా వడ్డీతో లబ్ధిదారులకు అందిస్తుంది. జగనన్న తోడు పథకంలో రుణం తీసుకున్న లబ్ధిదారులు వ్యాపారాలు నిర్వహించి తద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం నుంచి సహాయం పొందిన లబ్ధిదారులు 10 నుంచి 20 నెలల కాలంలో రుణాన్ని చెల్లించుకునే వెసులుబాటు కల్పించారు. రుణాన్ని సక్రమంగా చెల్లించిన లబ్ధిదారులకు ప్రభుత్వం వడ్డీ రాయితీని అందజేస్తుంది.

అల్లవరం మండలంలో రుణాల మంజూరు వివరాలు

ఆర్థిక సంవత్సరం	లబ్ధిదారులు	మంజూరు చేసిన రుణం
2020–21	210	రూ.21,00,000
2021–22	325	రూ.32,50,000
2022–23	365	రూ.36,50,000

అర్హులెవరంటే..

ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతం వెళ్లి వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు, కిరాణా వ్యాపారులు, కొబ్బరి కాయలు కొనుగోళ్లు, మగ్గం పని, లేస్ వర్కు, కుమ్మరి, కలంకారి, బొమ్మల తయారీ, ఇత్తడి వస్తువులు తయారీ, పిండి వంటలు, చెప్పులు కుట్టేవారు, వీధి వ్యాపారులు, టైలర్, కూరగాయలు, సైకిల్, మోటారుసైకిల్‌పై తిరుగుతూ వ్యాపారాలు చేసే వారు ఈ పథకానికి అర్హులు. అల్లవరం మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో గత మూడేళ్లలో జగనన్న తోడు పథకంలో సుమారు 900 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేశారు.

ఆసరా లభించింది



జగనన్న తోడు పథకం ద్వారా ప్రభుత్వం నుంచి పొందిన రుణంతో లేస్ వర్కుకి సంబంధించిన మెటీరియల్ కొనుగోలు చేసి చీరలకు లేస్ వర్కు చేస్తున్నారు. నా కుటుంబానికి ఆసరాగా లభించింది.
– గుబ్బల దుర్గ, శిరగట్లపల్లి, అల్లవరం మండలం

స్వయం ఉపాధి పొందాను



జగనన్న తోడు పథకంలో ప్రభుత్వం అందించిన రూ.10 వేలు రుణంతో కిరాణా వ్యాపారం ప్రారంభించి స్వయం ఉపాధి పొందుతున్నాను. ఇంటి వద్దనే కిరాణా వ్యాపారం చేసుకోవడం ద్వారా ఆర్థిక భరోసా లభిస్తుంది.
– కట్టా లక్ష్మి, బోడసకుర్రు, అల్లవరం మండలం

జగనన్నకు ధన్యవాదాలు



కూల్ డ్రింక్స్ షాపు నిమిత్తం జగనన్న తోడు పథకం ద్వారా రుణం తీసుకున్నాను. రుణాన్ని నెల నెల సక్రమంగా చెల్లిస్తున్నాను. చిరు వ్యాపారులకు తోడు పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్న జగనన్నకు ధన్యవాదాలు.
– రాకుర్తి వీరవెంకట పద్మావతి, గూడాల గ్రామం, అల్లవరం మండలం

ఆవుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు



ఆవుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అతికిస్తున్న ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణ రోడ్లపై రాత్రి సమయాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న ఆవుల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అనేకమంది క్షతగాత్రులవుతున్న నేపథ్యంలో స్థానిక ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు నివారణ చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు రోడ్లపై సంచరిస్తున్న ఆవుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమెల్లి నాగ సుధకొండ, అడ్డాల గోపాలకృష్ణ, కుడుపూడి శాంతి భూషణ్, దంగేటి వెంకటరమణ, మాకిరెడ్డి పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మెషీన్లు, వెట్ గ్రైండర్ అందజేత



మహిళలకు కుట్టు మెషీన్లు, వెట్ గ్రైండర్ అందజేస్తున్న లయన్స్ వశిష్ట ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక లయన్స్ క్లబ్ వశిష్ట ఆధ్వర్యంలో జీవనోపాధి నిమిత్తం ఆరుగురు మహిళలకు అయిదు కుట్టు మెషీన్లు, ఒక వెట్ గ్రైండర్ శనివారం అందజేశారు. స్థానిక విద్యుత్‌నగర్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వశిష్ట అధ్యక్షురాలు టి.మధుశ్రీ, రీజనల్ చైర్‌పర్సన్ మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, కోశాధికారి దేశరాజు పద్మ, జిల్లెళ్ల పద్మ, యనమదల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌తో మహిళలకు చేయూత



ఉప్పలగుప్తంలో మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్



జనుపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

ఉప్పలగుప్తం: మహిళా మార్ట్‌లతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు చేయూత కల్పించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఉప్పలగుప్తంలో నూతనంగా ఏర్పాటుచేసిన చేయూత మహిళా మార్ట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు ఈ మార్ట్ ద్వారా ప్రజలందరికీ సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్ మాట్లాడుతూ 1542 మంది డ్వాక్రా సంఘాల మహిళలు గ్రూపుకు రూ.2000 చొప్పున మార్ట్‌కు పెట్టుబడిగా పెట్టారని వివరించారు. బయటి మార్కెట్ కంటే 10 శాతం నుంచి 40 శాతం వరకు తగ్గింపు ధరలకు మార్ట్‌లోని వస్తువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, వైస్ ఎంపీపీ సాధే శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు చిక్కం త్రినాథ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ మండలి చైర్మన్ మానే శ్రీను, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, ఉప సర్పంచ్ మోకా శ్రీను, మోటూరి సత్యంకాపు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా అందుబాటులోకి సేవలు

అమలాపురం రూరల్: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని జనుపల్లెలో రూ.40 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ప్రవేశ పెట్టి దేశంలో పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్, సర్పంచ్ గాణాల భారతి, ఉప సర్పంచ్ వాకపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి రెడ్డి శిరీష, కుమ్మరి రంగారావు, గొవ్వాల సత్యనారాయణ, ఎంపీటీసీ పాలిశెట్టి దేవి మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ సిలబస్ బోధనపై అనుభవజ్ఞుల సహాయం

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్‌లలో ఈ విద్యాసంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తున్న నేపథ్యంలో అక్కడి ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల బోధనపై ఆగస్టు నెలలో అనుభవజ్ఞులైన ఏజెన్సీ ద్వారా శిక్షణనివ్వడానికి శనివారం పుదుచ్చేరి విద్యాశాఖ నిర్ణయించింది. ఇప్పటికే 10, 12 తరగతులు మినహా మిగిలిన అన్ని తరగతులు సీబీఎస్ఈ సిలబస్ అమలుకు నిర్ణయించారు. దీనిపై ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను సిద్ధం చేస్తున్నారు.

కోచ్ రమేష్ మృతికి సంతాపం

అమలాపురం టౌన్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తోరం రమేష్ అమలాపురంలో కొన్ని దశాబ్దాల పాటు బాడీ బిల్డర్‌గా, కోచ్‌గా సేవలందించారని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు అన్నారు. స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో రమేష్ సంతాప సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డర్లు, లిఫ్టర్లు రెండు నిమిషాల పాటు మౌనం వహించి శ్రద్ధాంజలి ఘటించారు. సంతాప సభలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, అసోసియేషన్ ప్రతినిధులు నగభేరి కృష్ణమూర్తి, గారపాటి చంద్రశేఖర్, చీకురుమిల్లి కిరణ్‌కుమార్, చిక్కం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహాన్ని తీరుస్తున్న ‘సేవా’దళం

అల్లవరం: మండలంలోని ఓడలరేవులో నాలుగేళ్ల క్రితం ఏర్పాటైన సేవాదళం ప్రతినిధులు వేసవి ప్రారంభం నుంచి చలివేంద్ర ఏర్పాటుచేసి ప్రయాణికులు, బాటసారులకు మజ్జిగ, రస్నా అందించి దాహార్తి తీరుస్తున్నారు. 20 మంది సభ్యులు గ్రూపుగా ఏర్పాటై పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోజూ సుమారు రూ.800 వెచ్చించి 45 రోజులుగా చలి వేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ప్రజలకు సహాయ సహకారాలు అందజేస్తున్న సేవాదళం సభ్యులను పలువురు ప్రశంసిస్తున్నారు.

గంగా, నైలు నదుల తపాలా బిళ్లల మినీయేచర్ సేకరణ



గంగా, నైలు నదుల చిత్రాలతో ఉన్న మినీయేచర్

అమలాపురం టౌన్: భారత దేశానికి స్వాతంత్ర్యం లభించిన మూడో రోజున అంటే 1947 ఆగస్టు 18వ తేదీన ఈజిప్టు భారతదేశాన్ని మొట్టమొదటిగా గుర్తించింది. ఆ విధంగా ఆ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు మొదలై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండు దేశాల్లోని గొప్ప నదులైన గంగా, నైలు నదుల చిత్రాలతో రెండు తపాలా బిళ్లలతో కూడిన మినియేచర్‌ను భారతీయ తపాలా శాఖ విడుదల చేసింది. ఈ మినియేచర్‌ను అమలాపురానికి చెందిన తపాలా బిళ్లల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు.

పశువులకు బీమాతో రైతుకు ధీమా



పశువులకు బీమా చేస్తున్న పశు సంవర్ధక శాఖ ఏడీఏ విజయరెడ్డి తదితరులు

అమలాపురం రూరల్: వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా పాడి పశువులు, గొర్రెలు, పందులకు బీమా చేయడం ద్వారా రైతుకు ధీమా ఉంటుందని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి అన్నారు. పేరూరులో డాక్టర్ సాహిత్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో 20 పశువులు, 150 గొర్రెలకు బీమా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు మరణిస్తే పశుపోషకులకు అండగా నిలబడేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. తెల్లకార్డున్న ఎస్సీ, ఎస్టీలు రూ.30 వేలు విలువ చేసే పాడిపశువుకు మూడేళ్లకు గాను రూ.384 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందన్నారు. తెల్లరేషన్ కార్డు లేకపోతే రూ.30 వేలు విలువచేసే పాడి పశువుకు మూడేళ్లకు రూ.960 ప్రీమియం చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో పశు సహాయకులు సురేష్, కిరణ్, రైతులు సత్యనారాయణ, గంగుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో రైతులకు లాభాలు



చొల్లంగిలో సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ తదితరులు

తాళ్లరేవు: సమీకృత వ్యవసాయం(ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం) చేయడం ద్వారా రైతులకు లాభాల పంట పడుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన చొల్లంగి రైతు భరోసా కేంద్రం పరిధిలో ఏర్పాటు చేస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని కరప సబ్ డివిజన్ వ్యవసాయ సహాయకుడు కె.బాబూరావు, తాళ్లరేవు మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధానంలో మొత్తం ఎకరా 50 సెంట్లకు గాను 80 సెంట్లలో వరిసాగు(బ్లాక్ రైస్), 20 సెంట్లలో చేపల పెంపకం, 10 సెంట్లలో కాలువపై నాటుకోళ్ల పెంపకం, 20 సెంట్లలో కూరగాయలు, ఆకుకూరలు తదితర వాటిని సాగు చేసుకుని లాభాలు ఆర్జించొచ్చన్నారు. మరో 20 సెంట్ల భూమిలో గొర్రెల పెంపకం, ఇతర గడ్డి జాతి పెంపకం చేపడతారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పద్మజ, అభ్యుదయ, వి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలతో క్రీడాకారులకు ట్రాక్ సూట్‌లు



మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావులను కలిసిన బాస్కెట్ బాల్ క్రీడాకారులు

అమలాపురం టౌన్: అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడాస్థలంలో జరిగిన వేసవి ఉచిత బాస్కెట్ బాల్ కోచింగ్ క్యాంపులో శిక్షణ పొందిన క్రీడాకారులకు ట్రాక్ సూట్‌ల కోసం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా రూ.2 లక్షల గ్రాంటు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాలను ట్రాక్ సూట్‌లు ధరించిన సమ్మర్ బాస్కెట్ బాల్ కోచింగ్ క్రీడాకారులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమ్మర్ కోచింగ్ క్యాంపు కోచ్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి రవాణా



ఉప్పలగుప్తం-వానపల్లిపాలెం దారిలో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి, గొల్లవిల్లి, మునిపల్లి, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం, నంగవరం తదితర గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే మట్టి రవాణా యథేచ్ఛగా జరుగుతుంది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వేసవిలో మెరక చేలల్లో మట్టి తీసి వ్యవసాయ భూమిని సాగుకు అనుకూలంగా చేసుకుంటారు. కాని రైతుల ముసుగులో మట్టి మాఫియా ఎలాంటి అనుమతులు తీసుకుండానే మట్టిని అనధికార లేఅవుట్లకు తరలిస్తున్నారు. ప్రధానంగా ఇలాంటి మట్టి ట్రాక్టర్‌లను నడిపేందుకు మైనర్ డ్రైవర్‌లు నియమిస్తుండడం, కొందరు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడంతో స్థానిక గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరిని వివరణ కోరగా మట్టి రవాణాకు ఎక్కడా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. సోమవారం అక్రమ లేఅవుట్లు, అక్రమ మట్టి రవాణా చేసే వారిని గుర్తించి మైన్స్ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత గాడిమొగ

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగి పంచాయతీ కొత్త కోరంగి గ్రామంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా గాడిమొగ జట్టు నిలిచింది. కోరంగి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో సుమారు 40 జట్లు పాల్గొనగా గాడిమొగ, కోరంగి జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్‌లో విజయం సాధించి గాడిమొగ విజేతగా నిలవగా కోరంగి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేత జట్టుకు కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాసకుమార్ బహుమతి ప్రధానం చేశారు. నిర్వాహకులను ఎస్‌ఐ అభినందించారు.

చిక్కాల పరామర్శ

తాళ్లరేవు: భార్యా వియోగంతో బాధపడుతున్న తాళ్లరేవు మాజీ ఎంపీటీసీ సభ్యుడు గంజా సూరిబాబును మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పరామర్శించారు. శనివారం స్థానిక కేశవపురంలోని సూరిబాబు స్వగృహానికి చిక్కాల, పలువురు టీడీపీ నాయకులు వెళ్లి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం



వీరాస్వామిని రక్షించి ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు

యానాం: యానాం-ఎదుర్లంక బాలయోగి వారధిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన వ్యక్తిని స్థానిక మత్స్యకారులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజులూరు గ్రామానికి చెందిన వెలుగుబంట్ల వీరాస్వామి(వీరబాబు) యానాం వైపు భాగంలోని వంతెన పైనుంచి గోదావరిలో దూకాడు. అక్కడే జీసస్ స్టాట్యూ వద్ద బోట్లు మరమ్మతు చేసుకుంటున్న మత్స్యకారులు చూసి తక్షణం స్పందించి బోటులో ఆ ప్రాంతానికి వెళ్లి మునిగిపోతున్న వీరబాబును రక్షించి ఒడ్డుకు చేర్చారు. యానాం పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి వీరబాబును ప్రాథమిక చికిత్స కోసం యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

అల్లవరం: అల్లవరం మండలం గూడాల గ్రామానికి చెందిన బందుల పెద్దయ్య(80) వడదెబ్బతో శనివారం మృతి చెందారు. రామాలయం వీధిలోని తన ఇంటి అరుగుపై విశ్రమించిన పెద్దయ్య వడదెబ్బకు గురై ఉన్న చోటనే మృతి చెందారని కుటుంబీకులు తెలిపారు. స్థానిక సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు పరిశీలించి అధికారులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించాలి

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అర్హులైన వారందరికీ వర్తింపజేయాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఈఓపీఆర్‌డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్ అధ్యక్షత వహించగా ఎంపీడీఓ కె.జాన్ లింకన్ పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్య సిబ్బందికి విధిగా మహిళ సంరక్షణ కార్యదర్శులు సహకరించాలన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ప్రజా సంక్షేమ పథకాలను అందించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షించారు. మండల ఇంజినీరింగ్ జేఈ కె.మురళీకృష్ణ, గ్రామ సంచాయతీ కార్యదర్శులు కె.సంజీవ్‌రెడ్డి, ఆర్‌వీవీ సత్యనారాయణ, శ్యామ్‌సుందర్, కెమో క్షాంజలి, ఎస్.వీర్రాజు, యు.రేణుక, సుప్రియ, వెంకటరెడ్డి, అయ్యన్న, సీహెచ్ వీరమాత, వేణు పాల్గొన్నారు.

పూరిపాకల దగ్ధంపై కేసు

తాళ్లరేవు: చొల్లంగిపేట వద్ద ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసినట్లు కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాసకుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 14వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మూడు పాకలు దగ్ధమై సుమారు రూ.లక్ష మేర నష్టం సంభవించిందని బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పుదుచ్చేరి తిరిగి వెళ్లిన ప్రధాన కార్యదర్శి

యానాం: యానాం నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ శనివారం ఉదయం పుదుచ్చేరికి తిరిగి పయనమై వెళ్లారు. ఆయనతో పాటు పుదుచ్చేరి ఇన్‌చార్జి కలెక్టర్ ఎల్.కుమార్, హెల్త్ సెక్రటరీ ఉదయ్‌కుమార్ తదితరులకు స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద ఆర్ఏఓ మునిస్వామి, ఆర్ఏఓ ఆఫీసు సిబ్బంది వీడ్కోలు పలికారు